సాక్షి
కుమురం భీం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024

నాగోబా జాతర షురూ

మెస్రం వంశీయుల మహాపూజతో కేస్లాపూర్‌లో నాగోబా జాతర ప్రారంభమైంది. కొత్త కోడళ్లు గోవడ్ వద్ద శనివారం తమ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఉపవాస దీక్ష విరమించారు. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

సిర్పూర్(టి) ఎంపీపీపై అవిశ్వాసానికి నోటీసులు జారీ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల పరిషత్ అధ్యక్షురాలు చునార్కర్ సువర్ణపై అవిశ్వాస తీర్మానానికి ఎంపీడీవో రాజేశ్వర్ మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు శనివారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 27వ తేదీన మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11.30గంటలకు ఎంపీటీసీ సభ్యులంతా హాజరై అవిశ్వాస ప్రతిపాదన చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



కనిష్కను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ విద్యార్థిని ఖాండ్రే కనిష్క రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో పాల్గొంది. 'స్మగ్లర్ల నుంచి చెట్లను రక్షించు విధానం' అనే అంశాన్ని ప్రదర్శించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రబంధకారిణి, సమితి ఆచార్యుల బృందం శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని కనిష్కను శాలువాతో సత్కరించి, అభినందించారు. పాఠశాల అధ్యక్షుడు చిలువేరు వెంకటేశ్వర్, కార్యదర్శి కొడిప్యాక వేణుగోపాల్, సహ కార్యదర్శి భోగ మధుకర్, సమితి కార్యదర్శి నాగుల శ్రీనివాస్, సభ్యులు కల్లూరి సంతోష్, వైరాగరే ప్రభాత్, ప్రధానాచార్యులు కోటేశ్వర్ రావు, ఆచార్య బృందం పాల్గొన్నారు.

గురుకుల పరీక్షకు సర్వం సిద్ధం

ఆసిఫాబాద్‌రూరల్: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న అర్హత పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేశారు. జిల్లాలో తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లో ఐదు, రెబ్బెనలో ఒకటి, సిర్పూర్ (టీ)లో రెండు, కాగజ్‌నగర్‌లో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2,762 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను గంటముందు కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

గ్రూప్-4లో శివకృష్ణకు ఫస్ట్ ర్యాంక్



శ్రీరామ్ శివకృష్ణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కంచుకోటకాలనీకి చెందిన శ్రీరామ్ శివకృష్ణ శుక్రవారం విడుదలైన గ్రూపు-4 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. శ్రీరామ్ వాణిశ్రీ,-సత్యనారాయణ దంపతుల కుమారుడు శివకృష్ణ 300 మార్కులకు గాను 220 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సరస్వతి శిశుమందిర్‌లో చదివాడు. బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించి బీటెక్ చదివాడు. ఇంటివద్దే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. గ్రూపు-1 మెయిన్ తక్కువ ర్యాంక్‌తో తప్పిపోయింది. కాగా, శివకృష్ణ ప్రస్తుతం సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు.

సైన్స్ ప్రయోగాల్లో రాణించాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: సైన్స్ ప్రయోగాల్లో విద్యార్థులు రాణించాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి ఈ నెల 24న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్‌వో సుభాష్, అబీద్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణహితకు జై..



ప్రాణహిత బ్యారేజ్ నిర్మించనున్న తుమ్మిడి హెట్టిలోని ప్రాణహిత నది

- కుమురంభీం ప్రాజెక్ట్ పనులు చేపడతాం
- బడ్జెట్‌లో ప్రస్తావించిన ఆర్థికమంత్రి భట్టి
- నీటిపారుదలకు రూ.28.024 కోట్లు
- మండలానికో పబ్లిక్ స్కూల్ మంజూరు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి ఓకే
- అసెంబ్లీలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్

కౌటాల: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం తొలి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జిల్లాకు మేలు జరిగేలా ఉంది. జిల్లాకు సాగునీరు అందించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించగా జిల్లా రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. బడ్జెట్‌లో ప్రతీ మండలానికి అత్యాధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మిస్తామని మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించారు. దీంతో జిల్లాలోని పేద ప్రజలకు లబ్ధిచేకూరనుంది. తొలి పద్దు జిల్లా వాసులకు ఉపయోగకరంగా ఉందని పలువురు ఆనందం వ్యక్తం చేయగా.. కొన్ని వర్గాలను విస్మరించారని పలువురు పేర్కొంటున్నారు.

రూ.2లక్షల రుణమాఫీ

జిల్లాలోని వేలాదిమంది రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీకి సంబంధించి మంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రూ.2లక్షల రుణమాఫీ కోసం త్వరలోనే కార్యాచరణ మొదలు పెట్టనున్నట్లు ప్రకటించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు తదితర హామీలు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిన విషయం తెలిసిందే. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీకి కార్యాచరణ చేస్తామని మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడంతో జిల్లాలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యం

ఆరు గ్యారంటీల అమలుకు తెలంగాణ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆరోగ్యశ్రీకి అవసరమైన నిధులు అందించనున్నారు. మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీకి నిధులు కేటాయించడంతో జిల్లాలోని మహిళా ప్రయాణికులకు మేలు జరగనుంది. జిల్లాలోని 15 మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. గృహజ్యోతి ద్వారా అర్హులందరికీ 200 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్ అందించనున్నారు. త్వరలోనే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించినున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాలోని పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణహిత మా లక్ష్యం

వ్యవసాయమే జీవనాధారమని, భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు సాగునీరందించే ఉద్దేశంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలోని కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి వద్ద 'ప్రాణహిత-చేవెళ్ల' ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం పదిహేనేళ్లుగా పనులు ముందుకు సాగలేదు. ప్రాణహిత ప్రాజెక్ట్‌కు బదులుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడంతో తమకు తీరని అన్యాయం జరిగిందని రైతులు వాపోతున్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం పదేళ్లలో నీటిపారుదల రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించి ఉండాల్సింది.. పచ్చని పైర్లతో తెలంగాణ భూభాగం కళకళలాడాల్సి ఉంది. గత పదేండ్లలో జరిగిన తప్పిదాలు నీటిపారుదల రంగంలో సాధించాల్సిన ప్రగతికి అవరోధాలుగా మారాయి' అని బడ్జెట్‌లో మంత్రి భట్టి ప్రస్తావించారు. ఈ కఠోర వాస్తవం గ్రహించినప్పుడే మనం భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోగలుగుతామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్లను పూర్తి చేసి ఎగువ ప్రాంతాలైన ఉమ్మడి ఆదిలాబాద్, ఇతర జిల్లాలకు సాగునీరు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కుమురంభీం ప్రాజెక్ట్ కాలువల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో ప్రాజెక్ట్ కెనాల్ పనులు చేపట్టనున్నారు. నీటి పారుదల శాఖకు రూ.28.024 కోట్ల నిధులు ప్రతిపాదించినట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత నిర్మించి తమ కల సాకారం చేస్తుందని జిల్లాలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తప్పించుకుంటే ఊరుకోం



కేంద్రం, మహారాష్ట్ర సర్కార్ సహకారంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారనే కార్యాచరణ ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వం మళ్లీ పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడితేనే.. అందుకు అనుగుణంగా మళ్లీ బడ్జెట్ ప్రవేశ పెడతామని ప్రకటించడంతోనే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీ అయినట్లు తెలుస్తోంది. మాటలు మాత్రమే చెప్పి అంకెల గారడీ చేసి తప్పించుకుందామంటే ఊరుకోం.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

దూకుడు తగ్గిందా?

- పరిష్కారం అంతంత మాత్రమే
- 'పోడు' పంపిణీపై ప్రత్యేక ముద్ర
- పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ
- కలెక్టర్ జిల్లాకు వచ్చి ఏడాది
- ఈ సందర్భంగా 'సాక్షి' కథనం



కలెక్టర్ హేమంత్ బోర్కడే

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే మహారాష్ట్ర విదర్భ రీజియన్‌లోని అమరావతి నగరంలో ఇంటర్ వరకు చదివారు. ఆ తరువాత పుణెలో బీటెక్.. ముంబైలో ఎంబీఏ పూర్తి చేశారు. 2014 నుంచి 2018 వరకు సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూనే ఐఏఎస్ అధికారి అయ్యారు. అటు ట్రైనీ కలెక్టర్‌గా.. ఇటు కలెక్టర్‌గా మొదటి పోస్టింగ్‌పై కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకే వచ్చారు. దేశంలోనే వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన కుమురంభీం జిల్లా రూపురేఖలు మార్చి తానేంటో నిరూపించుకుంటానన్న లక్ష్యంతో 2023 ఫిబ్రవరి 11న విధుల్లో చేరారు. ఆగమనంలో అదరగొట్టారు. అధికారులను పరుగులు పెట్టించారు. ఒక దశలో ఆ వేగాన్ని అందుకోవడంలో శాఖాధిపతులు వెనుకబడ్డారు. ఆరు నెలలు గడవగానే పరిస్థితి మొదటికి వచ్చింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకూ ఏకబిగిన సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. దీంతో అధికారుల వెంటపడతారన్న ముద్ర కలెక్టర్ హేమంత్ బోర్కడేపై ఉన్నా.. ఏడాది తిరిగేసరికి దూకుడు కొంత తగ్గిందనే చెప్పాలి. ప్రజాసమస్యలు తెలుసుకోవడానికి విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం ఈయన ప్రత్యేకత. గ్రామాల్లో ఆకస్మిక పర్యటనలు చేస్తుంటారు. ప్రతీ సోమవారం ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేకశ్రద్ధ చూపారు. ఆయా శాఖల అధికారులు నేరుగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని తనకు నివేదించేలా మార్పులు చేశారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై సమీక్ష నిర్వహిస్తున్నారు.

మొదట్లో బాగున్నా...

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలుత జిల్లా అధికారుల పనితీరుపై దృష్టి సారించారు. ఏయే శాఖల్లో అవినీతి బాగా జరుగుతోందన్న అంశంపైనా ప్రత్యేక నిఘా పెట్టారు. ముఖ్యంగా అవినీతి అధికారుల చిట్టా రూపొందించి వారి కార్యకలాపాలపై ఆరా తీశారు. చర్యలకు ఉపక్రమించారు. తొలి మూడు నెలల్లోనే పరిపాలనపై పూర్తిస్థాయి పట్టు సాధించడంపై ఇటు ప్రజలు, అటు ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రెవెన్యూ శాఖలో ఏళ్లకొద్దీ పాతుకుపోయి అవినీతికి అలవాటుపడ్డ కొందరు అధికారులపై కొరఢా ఝుళిపించారు. అప్పట్లో అనేక అవినీతి ఆరోపణలపై సెలవుపై వెళ్లిన ఓ రెవెన్యూ అధికారి మళ్లీ తనకు పోస్టింగ్ ఇప్పించమని కలెక్టర్‌ను కోరగా.. ఆయన ససేమిరా అనడం పరోక్షంగా అవినీతి అధికారులను తాను ఉపేక్షించబోమన్న సంకేతం ఉద్యోగుల్లోకి వెళ్లింది. అదే సమయంలో జిల్లా పంచాయతీ అధికారిని ఏకంగా ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అవినీతి, విధులను నిర్లక్ష్యం చేసే అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు.

ప్రభుత్వ ప్రాధాన్యమే తన ప్రాధాన్యంగా..

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజూ మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రత్యేకంగా నాకంటూ వ్యక్తిగతంగా ప్రాధమ్యాలేవీలేవు. 'ప్రభుత్వ ప్రాధాన్యమే నా ప్రాధాన్యం.' అన్నట్లుగా హేమంత్ బోర్కడే పనితీరు కొనసాగింది. ముఖ్యంగా దశాబ్దాలుగా నానుతూ వస్తున్న పోడు భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా పూర్తిచేశారు. సుమారు 15వేల మంది సాగుచేసుకుంటున్న 47 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు అందజేసి శభాష్ అనిపించుకున్నారు. అప్పటి ప్రభుత్వం గతేడాది జూన్‌లో తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేశారు. నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయం, పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతమయ్యేలా కృషి చేశారు. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి సీఎం మెప్పు పొందారు. తర్వాత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రేయింబవళ్లు అధికారులతో కలిసి పనిచేస్తూ జిల్లాలో అత్యధికంగా ఉన్న షాడో ఏరియాల్లోనూ ఎన్నికలు సజావుగా జరిగేలా జిల్లాయంత్రాంగంతో పనిచేయించారు. అందుకుగానూ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు తీసుకోవడం ఆయన పనితీరుకు అద్దంపడుతోంది.

తామరాకుపై నీటిబొట్టులా..

మొదట్లో కలెక్టర్ తాను పనిచేస్తూ.. అధికారులతో పనిచేయిస్తూ యంత్రాంగంలో బద్ధకాన్ని వదిలించారు. అలసత్వంగా ఉంటే ఊరుకోరని, వెంటపడతారన్న సంకేతాలను పంపారు. జిల్లాలో అవినీతి, అవకతవకలు వెలుగులోకి వచ్చిన సందర్భంలో మొదట్లో కలెక్టర్ కఠినంగా వ్యవహరించి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ప్రస్తుతం విచారణకు ఆదేశించడం మినహా తదుపరి చర్యలు తీసుకోలేకపోతున్నారు. జిల్లావ్యాప్తంగా సర్కారు భూములు అన్యాక్రాంతమవుతున్నా ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. క్రమంగా పట్టు సడలించడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. జిల్లాలోని రాజకీయ పరిస్థితుల కారణంగానే ఈ దుస్థితి దాపురించందన్న విమర్శలున్నాయి. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో అలసత్వం చూపే అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరించడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీంతో వారు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. పనిచేయని అధికారుల జోలికి వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవడమెందుకని, ఉన్నంత కాలం వివాదాలకు తావులేకుండా పనిచేయాలన్న ధోరణి కలెక్టరు పనితీరులో కనిపిస్తోంది.

పీవీటీజీలకు మెరుగైన వైద్యసేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: పీవీటీజీలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీవీటీజీలకు అందించే వైద్యసేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జనమన్ పథకం కింద పీవీటీజీలకు వైద్య సేవలందించేందుకు ఒప్పంద పద్ధతిన వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్‌నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లను నియమించినట్లు చెప్పారు. జిల్లాలోని మారుమూల పీవీటీజీ గ్రామాలకు వైద్య సేవలందించేందుకు మొబైల్ హెల్త్ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వాహనం ప్రతిరోజూ ఉదయం 8గంటలకు ఆయా గ్రామాల్లో వైద్యసేవలందించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. పీవీటీజీలతో మమేకమై వారితో మర్యాదగా ప్రవర్తించాలని, వైద్యసేవలపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లోని ప్రతీ పీవీటీజీ కుటుంబాన్ని సందర్శించి ఆరోగ్యసమస్యల వివరాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాం, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతి, ఇంటర్‌లో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం అర్హత పరీక్ష నిర్వహించినట్లు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. తొమ్మిదో తరగతికి గాను 1,017 మంది దరఖాస్తు చేసుకోగా 735 మంది హాజరయ్యారు. 282 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు 1,529 మంది విద్యార్థులకు 1,195 మంది హాజరు కాగా, 334 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

కాగజ్‌నగర్ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించారు. తొమ్మిదో తరగతిలో 11 ఖాళీలుండగా 1,017 మంది దరఖాస్తు చేసుకోగా 735 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశానికి 1,529 మంది దరఖాస్తు చేసుకోగా, 1,195 మంది హాజరైనట్లు వివరించారు.


ఆసిఫాబాద్ ఆర్డీవో బదిలీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆసిఫాబాద్ ఆర్డీవో కదం సురేశ్ నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు. నిర్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీ లోకేశ్వర్‌రావును ఆసిఫాబాద్ ఆర్డీవోగా బదిలీ చేశారు. త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

పలువురు తహసీల్దార్లు కూడా..

జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీలు చేస్తూ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వాంకిడి తహసీల్దార్ రహీమొద్దీన్‌ను కామారెడ్డికి, కెరమెరి తహసీల్దార్ ఎండీ జమీర్‌ను జగిత్యాలకు, రెబ్బెన తహసీల్దార్ అహ్మద్ ఖాన్‌ను సిద్దిపేటకు, సిర్పూర్ (యూ) తహసీల్దార్ ఎస్.రమేశ్‌ను మంచిర్యాలకు, కౌటాల తహసీల్దార్ కే శ్రీపాల్‌ను హనుమకొండకు, తిర్యాణి తహసీల్దార్ ఆర్.ప్రహ్లాద్‌ను జయశంకర్ భూపాల్‌పల్లికి, ఆసిఫాబాద్ తహసీల్దార్ కే రమేశ్‌ను మంచిర్యాలకు, మంచిర్యాల జిల్లా తాండూర్ తహసీల్దార్ డీ రోహిత్, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ డీఏవో యూ జ్యోత్స్న, బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయ డీఏవో దేశ్‌పాండే శ్రీనివాసరావు, మంచిర్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ డీ సునీల్‌ను కుమురంభీం ఆసిఫాబాద్‌కు జిల్లాకు బదిలీ చేశారు. జగిత్యాల జిల్లా ఎడల్‌పల్లి తహసీల్దార్ ఎం.ఉదయ్‌కుమార్, పెద్దపెల్లి కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఈ పుష్పలత, మంథని ఆర్డీవో కార్యాలయ డీఏవో టీ రవీందర్‌ను కుమురంభీం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికలపై అధికారులకు అవగాహన



మాట్లాడుతున్న దీపక్ తివారి

కాగజ్‌నగర్ రూరల్: లోకసభ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలను వారం రోజుల్లో పర్యటించి పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన కనీస మౌలిక వసతులు పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా టాయిలెట్స్, ర్యాంపు, రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు పరిశీలించాలన్నారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడానికి సెక్టార్, ప్రిసైడింగ్ అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్డీవో సురేశ్, మాస్టర్ ట్రైనర్లు భరత్, ఉప్పులేటి శ్రీనివాస్, ఆసీఫ్, లతీఫ్, వీరశంకర్, శాంతికుమార్, శ్రీనివాస్, తిరుపతయ్య, తిరుపతి, బాలకృష్ణ, సెక్టార్ అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు, ఎన్నికల నిర్వహణలో వారి పాత్ర, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలో పులుల సంరక్షణకు రేంజ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ సెక్యూరిటీ ఆడిట్ బృందం (ఎన్టీసీఏ) బృందం అధికారులు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్‌లు అలోక్‌కుమార్, యోగేశ్ సూచించారు. శనివారం సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్‌లోగల ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతంలో పర్యటించి పులుల సంరక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో పులులు ప్రవేశించే ప్రదేశాల్లో వాటికి ఆవాసయోగ్యంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు పులులు ప్రవేశమయ్యే ప్రదేశాలను పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు. పులుల రాక, ఆవాసయోగ్య ప్రదేశాలు, సంరక్షణ చర్యలు తదితర అంశాల గురించి సిర్పూర్(టి) రేంజ్ అధికారి పూర్ణచందర్ వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ జిల్లా అధికారి నీరజ్‌కుమార్, ఎఫ్ఆర్వో పూర్ణచందర్, డిప్యూటీ రేంజ్ అధికారి అబ్దుల్ మునవిర్, ఎఫ్ఎస్‌వో సద్దాం హుస్సేన్, బీట్ అధికారులు నరేశ్, షాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.

దరిగాం అటవీ ప్రాంతంలో..

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ అటవీ ప్రాంతాన్ని ఎన్టీసీఏ బృందం సభ్యులు యోగేశ్, అలోక్‌కుమార్ శనివారం పరిశీలించారు. పులుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి డీఎఫ్‌వో నీరజ్, ఎఫ్ఆర్వో రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శశిధర్‌బాబు, ఎఫ్‌బీవోలు నవ్య, బానయ్య, విజయ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో 'సెక్టోరల్' పాత్ర కీలకం

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్ హేమంత్ బోర్కడే పేర్కొన్నారు. శని వారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సెక్టోరియల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు పార్లమెంట్ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్‌కేంద్రాలను సందర్శించి కల్పించాల్సి న సౌకర్యాలపై కార్యాచరణ రూపొందించాల ని సూచించారు. సహాయక పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది సంఖ్య పెరుగుతుందని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన రూట్ మ్యాప్‌లను పాటించాలని, తహసీల్దార్లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాల ని పేర్కొన్నారు. ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్‌రోజున ఈవీఎం సమస్య తలెత్తితో పోలింగ్ ప్రక్రియలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్‌రోజు ముందుగా మాక్‌పోలింగ్ నిర్వహించాలని సూచించారు. 17సీ డైరీపై అవగాహన కలిగి ఉండాలని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల సంబంధిత అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా గిరిజనాభివృద్ధికారి రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నెల్లూరు రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి


రూప (ఫైల్)

మంచిర్యాలక్రైం: నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన గోలి రూప (36) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చెన్నైలో స్థిరపడిన రూప శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఉంటున్న తన తల్లిని చూసేందుకు ఓ ప్రైవేటు బస్సులో బయలుదేరింది. టోల్‌ప్లాజా వద్దకు రాగానే బస్సు, లారీ ఢీకొన్నాయి. ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో రూప అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త కస్యాప్, కుమారుడు సిద్దార్థ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఎస్కే సిరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్లి తిరిగివస్తుండగా పాత బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో సిరాజ్‌తో పాటు అతని భార్య ఇసాత్‌బేగం, కుమారెత్త సోనా, కుమారుడు అజాంకు గాయాలయ్యాయి. వెంటనే 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరి రిమాండ్

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రామక్క, పోసమ్మలను బైండోవర్ ఉల్లంఘన కేసులో రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ బాబ తెలిపారు. గతంలో ఇద్దరూ గుడుంబా అమ్ముతుండగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, మళ్లీ గుడుంబా విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు తహసీల్దార్ రాఘవేంద్రరావు నోటీసులు జారీ చేసి జరిమానా చెల్లించాలని చెప్పినా చెల్లించకపోవడంతో బైండోవర్ కాలపరిమితి వరకు జైలుశిక్ష విధించగా రిమాండ్ నిమిత్తం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి శివారులో పేకాట స్థావరంపై శనివారం దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది రమేశ్, మధు, సంజీవ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

'కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి'

మంచిర్యాలఅర్బన్: తాండూర్ మండలం కస్తూరిబా ఇన్‌చార్జి ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, వీజేఎస్ జిల్లా గోపాల్, షేక్ సల్మాన్ పాషా, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర షురూ

- 202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)
- ఉపవాస దీక్ష విరమించిన భేటింగ్ కోడళ్లు
- తరలి వస్తున్న భక్తజనం


జాతరకు తరలి వస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాస్య అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. మొదటి రోజు శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఈ నెల 15 వరకు అధికారికంగా...మరో రెండు రోజుల పాటు అనధికారికంగా జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి తెలిపారు

202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. కొత్త కోడళ్లు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 202 మంది కోడళ్లకు మెస్రం వంశ మహిళా పెద్దల సహాయంతో సతీదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుంచి శనివారం తెల్లవారు జామువరకు భేటింగ్ పూజలు నిర్వహించారు.

ఉపవాస దీక్షలు విరమణ

శుక్రవారం ఉదయం నుంచి కఠోర ఉపవాస దీక్షలతో ఉన్న కొత్త కోడళ్లు శనివారం ఉదయం ఒకరి వెనుక ఒకరు వరుసక్రమంలో మర్రిచెట్టు వద్దగల కోనేరు బావివద్దకు వెళ్లి నీటిని సేకరించారు. ఆ నీటితో గోవడ్ వద్ద దేవతలను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

నాగోబాను దర్శించుకున్న అతిథులు

శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజ అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్ ఆలం దంపతులు, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీ యులు అతిథులను శాలువాతో సత్కరించి నాగో బా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పటేల్ మెస్రం వెంకట్‌రావ్, పెద్దలు మెస్రం బాదిరావ్, చిన్ను పటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం ఉద్యోగులు మెస్రం దేవ్‌రావ్, మెస్రం మనోహర్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రవెల్లి: నాగోబా దర్బార్ హాల్‌లో శనివారం రాత్రి ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని అంతపూర్, గుడిహత్నూర్ మండలంలోని మచ్చపూర్ కళాకారులు డెంస, గుస్సాడీ నృత్యం చేయడంతో పాటు గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన మర్సుకోల కలబాయి బృందం సభ్యులు కిక్రి వాయిస్తూ పాటలు పాడారు.


నాగోబా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్,కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలాం


ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా దంపతులకు నాగోబా ప్రతిమ ఇస్తున్న పటేల్ వెంకట్‌రావ్


జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు నాగోబా ప్రతిమను అందిస్తున్న మెస్రం వంశీయులు


గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాబృందం సభ్యులు


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్


భేటింగ్‌కు హాజరైన మెస్రం వంశ కొత్త కోడళ్లు


కోనేరు నుంచి నీటిని సేకరించడానికి వస్తున్న కొత్త కోడళ్లు

మోగనున్న పెళ్లిబాజాలు

- నేటి నుంచి శుభ ముహూర్తాలు
- ఈ నెల 10 నుంచి మాఘమాసం



ఆసిఫాబాద్‌అర్బన్: నేటి నుంచి శుభముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 నుంచి మాఘ మాసం ప్రారంభమవుతూ మంచి రోజులను వెంట తీసుకువస్తోంది. 11వ తేదీనుంచి పెళ్లిసందళ్లు ప్రారంభం కానున్నాయి. మాఘం, పాల్గుణం, చైత్ర మాసాల్లో (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్) దాదాపు 35 నుంచి 40వరకు ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26 తర్వాత దాదాపు మూడు నెలల పాటు (ఆగస్టు వరకు) ముహూర్తాలు లేవు. దీంతో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే ఎక్కువ సంఖ్యలో శుభ కార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే చాలా కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాల తేదీలు చూసుకున్నారు.

పలువురికి ఉపాధి

ఈ మూడు నెలల్లో శుభ ముహూర్తాలు ఉండడంతో పలువురికి ఉపాధి లభించనుంది. పెళ్లిళ్లు, ఉపనయనాలు, గృహప్రవేశాలు, పుట్టు వెంట్రుకలు, ఇతర శుభకార్యాలు జరుగనున్నాయి. పురోహితులు, బ్యాండ్‌మేళా, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్, టెంట్‌హౌజ్, ఫంక్షన్ హాల్, వర్కర్లకు ఉపాధి లభించనుంది. బట్టలు, బంగారం, తదితర వ్యాపారులకు ఆదాయం సమకూరనుంది.

ముహూర్తపు తేదీలు

మాఘమాసం: ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 28, 29

పాల్గుణమాసం: మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4

చైత్రమాసం: ఏప్రిల్ 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

ఈ తేదీలు దాటితే తిరిగి ఆగస్టులోనే మళ్లీ శుభముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు పేర్కొంటున్నారు.

భర్త ఇంటి ఎదుట ఆందోళన

రామకృష్ణాపూర్: భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళనకు దిగిన సంఘటన పట్టణంలోని ఏజోన్ ఏరియాలో శనివారం చోటు చేసుకుంది. కాజీపేట్‌కు చెందిన వందనకు పట్టణానికి చెందిన ఊట్ల సంతోష్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. దంపతులకు కుమార్తె సంతానం. ఇన్నాళ్లూ సాఫీగానే సాగిన కాపురంలో అత్త పుష్ప, మామ ఆశీర్వాదం కారణంగా వివాదాలు తలెత్తాయని వాపోయింది. ఇటీవలే సంతోష్‌కు నర్సింగ్ ఉద్యోగం వచ్చిందని ఈ క్రమంలో శనివారం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగంలో ఉన్న తన భర్త దగ్గరకు కూతుర్ని తీసుకుని వెళ్లగా ఇంట్లో అమ్మానాన్నలకు నువ్వంటే ఇష్టంలేదని, వేరే పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను పంపించాడని విలపిస్తూ చెప్పింది.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం

బెల్లంపల్లి: జార్ఖండ్‌లోని రాంచీలో ఈనెల 9న జరిగిన జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులతో కూడిన రాష్ట్ర జట్టు కాంస్యపతకం సాధించింది. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వర్షిత్, ఇతర విద్యార్థులు సింహాచలం, అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు. రాజస్థాన్ జట్టు ప్రథమ బహుమతి, మహారాష్ట్ర జట్టు ద్వితీయ బహుమతి, తెలంగాణ రాష్ట్ర క్రీడాకారుల జట్టు తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అంజయ్య, పీడీ బాబురావు తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

జన్నారం: సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 టీంలు పోటీలలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు సాయి, గంగాసింగ్, సుమన్ తెలిపారు. పోటీలు ఈనెల 18 వరకు జరుగుతాయని, అదే రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు అందించనున్నట్లు తెలిపారు.

కుట్టుశిక్షణ ద్వారా జీవనోపాధి


లక్సెట్టిపేట: మహిళలు కుట్టుశిక్షణ నేర్చుకోవడం ద్వారా జీవనోపాధి దొరుకుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శనివారం మండలంలోని చందారంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతూ వారికి కుట్టుశిక్షణ అందించడాన్ని అభినందించారు. అనంతరం ముప్పై మంది అక్షర వాలంటీర్లకు పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ పీవో పురుషోత్తం నాయక్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, డీఆర్పీలు జనార్దన్, వెంకటేశ్వర్లు, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత పెంచితేనే భవిష్యత్

- ఎస్‌వోటూ జీఎం రఘు కుమార్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచితేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎం కే.రఘుకుమార్ తెలిపారు. శనివారం ఆర్కే న్యూటెక్ గనిపై మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పని స్థలాల్లో రక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. యంత్రాల పనిగంటలు మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏజెంట్ రాముడు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ స్వామి రాజు, రక్షణాధికారి కొట్టే రమేశ్, పిట్ ఇంజనీర్ రాజగోపాలచారి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో ఏటీఎం చోరీ.. ఇక్కడ పరికరాలు


అందుగులపేట వద్ద పడేసిన పరికరాలు

మందమర్రిరూరల్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఏటీఎం చోరీకి వినియోగించిన పరికరాలను మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట జాతీయ రహదారి పక్కన శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయడంతో వారు గోదావరిఖనిలో ఏటీఎం చోరీకి వినియోగించిన పరికరాలుగా భావించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీంతో అందుగులపేటకు చేరుకుని గ్యాస్‌కట్టర్ తోపాటు ఏటీఎం మిషన్‌కు సంబంధించిన డబ్బులు నిల్వ ఉంచే బాక్సులు, పరికరాలు స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు అత్యంత గోప్యంగా వివరాలు సేకరిస్తున్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాల పేరిట టోకరా

- రూ. 5.5 లక్షల వసూలు
- యువతి అరెస్టు

కరీంనగర్‌క్రైం:ఉద్యోగాలు ఇప్పిస్తామని ముగ్గురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ యువతిపై కేసు నమోదు చేసినట్లు శనివారం టూటౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు కరీంనగర్‌లోని ముకరాంపురలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో అదే హాస్టల్‌లోని వారి గదిలో హన్మకొండకు చెందిన పి.ప్రత్యూష చేరింది. తాను కోర్టు కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకొని నకిలీ ఐడీకార్డు, పోలీసు డ్రెస్‌తో ఉన్న ఫొటోలు చూపించింది. తాను కూడా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని తెలిపింది. డబ్బులు పెట్టి పోలీసు ఉద్యోగం పొందానని నమ్మించింది. మీరు కూడా డబ్బులు ఇస్తే కానిస్టేబల్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపించింది. ఇద్దరు యువతులతోపాటు మరో యువకుడి వద్ద పలు దఫాలుగా రూ.5.5 లక్షలు వసూలు చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు ప్రత్యూషను నిలదీశారు. కొంత డబ్బులు తిరిగి చెల్లించి మిగతా డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆదివాసీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

కాసిపేట: ఆదివాసీ సంప్రదాయాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, వాటిని కాపాడుకుంటూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఓరియంట్ సిమెంట్ కంపనీ కార్మిక సంఘం నాయకుడు కొక్కిరాల సత్యపాల్ రావు అన్నారు. శనివారం కుర్రెఘడ్‌లో ఆదివాసీలు నిర్వహించే పాహుండి కూపర్ లింగుస్వామి జాతరకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి వెంకటేష్, కనకరాజు, జనార్దన్, తుడుందెబ్బ రాష్ట్ర పధాన కార్యదర్శి జంగు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనుకుల రాకేష్, ప్రధాన కార్యదర్శి జంగిలి రమేష్, నాయకులు షాకీర్, తిరుపతి, దుర్గం గణేష్, ఆదివాసీలు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



మంచిర్యాలక్రైం: జిల్లాకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఎం వెంకటరమణతో పాటు హైదరాబాద్, మంచిర్యాలకు చెందిన మరో నలుగురు కారులో లంబసింగి, అరకు, వైజాగ్, పాడేరు, ప్రాంతాల్లో పర్యటించేందుకు శనివారం వెళ్లారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జీమడుగుల మండలం వంజరి సమీపంలోని సంజీవనిఘాట్ వద్దకు రాగానే ఒక్కసారిగా కారులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమై కారును అక్కడే నిలిపి కిందికి దిగి పారిపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


సమ్మయ్యను అభినందిస్తున్న డీసీపీ

బెల్లంపల్లి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 9న నిర్వహించిన ఐదో జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో బెల్లంపల్లి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య సత్తా చాటాడు. 45 ఏళ్ల విభాగంలో నిర్వహించిన డిస్కస్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. షార్ట్‌పుట్ పోటీల్లో నాలుగోస్థానంలో నిలిచాడు. సమ్మయ్యను శనివారం తన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

కోటపల్లి: రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని అభివృద్ధి చెందాలని భారతీయ కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వీకేసింగ్ అ న్నారు. శనివారం ఆ లుగామలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. రైతుల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా భారత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌ల సాయంతో కలుపు మందులు, పురుగు మందులు, తెగులు మందులు స్ప్రే చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్ఎస్.బల్లోలి, కేఎస్ రెడ్డి, శ్రీదేవి శంకర్, నోడల్ అధికారి టి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చూడాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని షంషీర్ నగర్ బస్తీలో షాదీఖానా స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని మైనార్టీ నాయకులు శనివారం ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువైన స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి నకిలీ పత్రాలు సృష్టించారన్నారు. వాటి ఆధారంగా కోర్టులను మోసం చేస్తూ స్థలాన్ని అమ్మకానికి పెడుతున్నారన్నారు. స్పందించిన ఆర్డీవో విచారణ జరిపి కబ్జా దారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్వర్‌ఖాన్, షరీఫ్, ఎండీగౌస్, అమానుల్లాఖాన్, జావీద్‌ఖాన్, అఫ్జల్ బాబా, సాబీర్,పాల్గొన్నారు.

'విద్యారంగానికి అరకొర నిధులు'

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం మంచిర్యాల మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సవరించి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు రాజ్‌కుమార్, సిద్ధార్థ, కార్తీక్, అజయ్ పాల్గొన్నారు.